సీసీ రోడ్డు పనులకు నేడు శంకుస్థాపన

రాజేంద్రనగర్: నియోజకవర్గంలోని శివరాంపల్లి, బుద్వేల్ వర్మ కాలనీల్లో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన పూజా కార్యక్రమాలను ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ పాల్గొని నిర్వహిస్తారని నాయకులు బొక్క ప్రభాకర్ రెడ్డి, పలుగు చెరువు మహేష్ తెలిపారు.

50 మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు



వినాయక మండపాల వద్ద అన్నదానంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: సర్కిల్ పరిధిలోని గణేష్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. బస్తీలు, కాలనీలు, యూత్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద నిర్వాహకులు మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులతో పాటు చుట్టు పక్కల ప్రాంతవాసులు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదానాన్ని స్వీకరిస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్ల పరిధిలో దాదాపు 2వేలకు పైగా మండపాలను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు దాదాపు 50 మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులు హాజరవుతున్నారు.

ఎస్ఎస్ఆర్ సర్వేకు సహకరించాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో ఈఆర్ఓ ముకుంద్‌రెడ్డి

శేరిలింగంపల్లి: ఓటరు జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్ (ఎస్ఎస్ఆర్) 2025 సర్వే కోసం ఇంటింటికి వచ్చే బీఎల్ఓలకు సహకరించాలని శేరిలింగంపల్లి ఈఆర్ఓ, డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి తెలిపారు. గురువారం శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో ఓటరు జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్‌పై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముకుంద్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లకు అవగాహన కల్పించి సర్వే కోసం వచ్చే బీఎల్ఓలకు సహకారం అందించాలని కోరారు. అదే విధంగా ఏమైనా సూచనలు ఉన్నా చేయాలన్నారు. బీఎల్ఓలు ఇంటింటికి వెళ్ళి ఫోన్ యాప్‌లో ఓటర్ల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తారని, ఓటరు జాబితా ప్రకారం ఓటర్లు అక్కడ ఉన్నారా, లేదా ఎక్కడికైనా షిఫ్ట్ అయ్యారా, పేరు నమోదులో తప్పులు ఉన్నా, ఓటరు మరణిస్తే కుటుంబ సభ్యులతో వివరాలు తీసుకొని వాటిని నమోదు చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీలు శ్రవణ్ రెడ్డి, ప్రేమ్‌కుమార్, పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సర్కిల్ కార్యాలయంలో పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఈఆర్ఓ ముకుంద్‌రెడ్డి



అలకాపూర్ ఎంజీ పార్కు వినాయకుని వద్ద పూజల్లో స్థానికులు



మణికొండ మహాదేవ్ యూత్ గణేష్ పూజలో మహిళలు

వైభవంగా వినాయక నవరాత్రులు

శంషాబాద్, అత్తాపూర్, బండ్లగూడ, మైలార్‌దేవ్‌పల్లి: మణికొండ: వినాయక నవరాత్రి ఉత్సవాలు నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిలోని గొల్లిదొడ్డి, వట్టినాగులపల్లి, ఖానాపూర్, గండిపేట, కోకాపేట, నార్సింగి, మంచిరేవుల, పుప్పాలగూడ, నెక్నాంపూర్, మణికొండ గ్రామాలలో ఘనంగా భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో 6వ రోజు బుధవారం పలు మండపాలలో ప్రత్యేక పూజలు, అన్నదానాలను నిర్వహించారు. పలు మండపాల వద్ద బాల, బాలికలు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరిస్తున్నాయి. కొన్ని మండపాలలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను నిమజ్జనాలకు తరలిస్తున్నారు. ఆట పాటలతో, భజనలతో వాటిని నెక్నాంపూర్, కోకాపేటలలోని నిమజ్జన సాగర్‌లకు తరలిస్తున్నారు. ఆయా గ్రామాలలో జరిగిన పూజలలో కౌన్సిలర్‌లు, నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



నార్సింగి గణపతి పూజలో మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ యాదవ్



అలకాపూర్ టౌన్‌షిప్‌లోని పూజలో కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్ తదితరులు



మణికొండ నవజ్యోతి యూత్ వినాయక పూజలో సభ్యులు



మంచిరేవుల వినాయకుని పూజలో గ్రామస్తులు



వరసిద్ధి గణేష్‌కు పూజలు నిర్వహిస్తున్న డీసీపీ రాజేష్



మైలార్‌దేవ్‌పల్లి ఎమ్మెల్యేను సన్మానించిన మండప నిర్వాహకులు



వినాయక పూజల్లో కార్పొరేటర్ సాగర్‌గౌడ్ తదితరులు



రాజేంద్రనగర్ వినాయకుడి పూజల్లో భక్తులు

యువత చూపు బీజేపీ వైపు

శంషాబాద్ రూరల్: మండలంలోని పెద్దగోల్కొండలో గురువారం చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఆదరించిన ప్రజలు మంచి మెజార్టీ ఇచ్చారని గుర్తు చేశారు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చొరవ తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ మేరకు కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కేడర్‌కు దిశా నిర్దేశం చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

పల్లకిలో తరలిన ప్రకృతి గణపయ్య



గణపతిని పల్లకిలో నిమజ్జనానికి తీసుకెళ్తున్న స్కూల్ విద్యార్థులు

శంషాబాద్: పట్టణంలోని శారదా విద్యామందిర్ స్కూల్లో ఏర్పాటు చేసిన పర్యావరణ హితమైన మట్టిగణపయ్య నిమజ్జన వేడుకలను ఘనంగా జరిపారు. పల్లకిలో గణనాథుడిని ఆసీనం చేసిన తర్వాత పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల నుంచి స్థానిక చెరువు వరకు పల్లకిలో వినాయకుడిని తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దేవేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఫాతిమా, ఉపాధ్యాయులు సోని, సువర్ణ, రమాదేవి, రాణి, అఖిల, అప్సర, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో గత రెండు రోజులుగా నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్- 2024 గురువారం ముగిసింది. ఈ కార్యక్రమంలో మొత్తం 103 టీమ్‌లు పాల్గొనగా, అందులో 25టీమ్‌లు వివిధ ప్రముఖ సంస్థల జ్యూరీ సభ్యులచే ఎంపిక చేశారు. ఈ కార్యక్రమం ముగింపు ఉత్సవంలో గురువారం ప్రిన్సిపాల్ చంద్రమోహన్ రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, సీఎస్ఈ విభాగం హెచ్ఓడీ డాక్టర్ సీఆర్‌కే రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ శ్యామ్ సుందర్‌లు పాల్గొని విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులలో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. అన్ని జట్లు ఉత్తమ ప్రతిభ చూపించాయన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హ్యాకథాన్ ముగింపు ఉత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా బాల్‌రెడ్డి



పీఆర్‌టీయూ నూతన కార్యవర్గానికి సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు

శంషాబాద్: పీఆర్‌టీయూ నూతన కార్యవర్గానికి గురువారం టి. బాల్‌రెడ్డి మరోసారి నియమితులయ్యారు. గౌరవ అధ్యక్షులుగా వీరమల్లేష్, ప్రధాన కార్యదర్శి భాస్కర్, అసోసియేట్ అధ్యక్షులుగా రాములు రాథోడ్, రాములు యాదవ్, ఉపాధ్యక్షులు గణేష్, మహిళా ఉపాధ్యక్షులు జగతి, మహిళా కార్యదర్శిగా వందన, కార్యదర్శి కిశోర్‌ను నియమించారు. ఎన్నికల పర్యవేక్షణకు జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి పాల్గొని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయూ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ సభ్యులు మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, వందన, జ్యోతి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి పూజలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలోని పలు మండపాలలో గురువారం వినాయకుడి పూజలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండపాలలో వినాయకుడికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించాలన్నారు. డీజే సినిమా పాటలు కాకుండా భక్తి పాటలు, భజన పాటలతో మండప నిర్వాహకులు ఆనందంగా జరుపుకోవాలని యువతను కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



మైలార్‌దేవ్‌పల్లిలోని వినాయక పూజలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలి

-హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ తమ రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ సెల్, హెచ్‌సీయూ ఆధ్వర్యంలో స్వచ్ఛత, ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని క్యాంపస్‌లోని యూనివర్సిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం నిర్వహించారు. ఈ ఆరోగ్య శిబిరాన్ని విసిస్టా సూపర్ స్పెషాలిటీ ఆయుర్వేద సహకారంతో నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఇటీవలి కాలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ఆరోగ్యం పట్ల అందరూ శ్రద్ధ వహించాలన్నారు. యూనివర్సిటీలో కూడా కొంత మంది అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి కోసం శిబిరం ఏర్పాటు చేయడం ఆనందదాయకమని అన్నారు. అందరూ ఆయుర్వేద వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు. అనంతరం ఆయుర్వేద మందులను ఉచితంగా విద్యార్థులు, ఉద్యోగులకు వారు అందించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రికి చెందిన డాక్టర్ జీకేరెడ్డి, డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ గాయత్రి వైద్య సేవలను అందించారు.

గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు

గోల్కొండ: గోల్కొండ ఏరియాసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీ నర్సింహారావు అన్నారు. ఔట్ పేషెంట్ల సంఖ్య పెరుగుతుందని, ఇన్‌పేషంట్ విభాగంలో రోజుకు 30 వరకు చేరుతున్నారని తెలిపారు. ప్రసవాల సంఖ్య కూడా 150 వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఆసుపత్రిలో డెర్మటాలజీ, చిన్న పిల్లల విభాగం కూడా ఉందని తెలిపారు. ఆసుపత్రిలో రోజుకు 15 మందికి డయాలసిస్ చేస్తున్నామని అలాగే అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలు, సర్జన్, ఫిజిషియన్ సేవలు, ఈసీజీ, ఎక్స్‌రే సేవలు కూడా అందిస్తున్నామన్నారు.



డాక్టర్ పీవీ నర్సింహారావు

రాష్ట్రంలో రౌడీ పాలన సాగుతోంది

- కౌశిక్ రెడ్డిపై జరిగిన దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- 9నెలల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణను అన్ని రంగాల్లో నాశనం చేసింది
- ప్రశ్నించిన వారందరిపై రాష్ట్ర ప్రభుత్వం దాడులు చేస్తోంది

: పోరెడ్డి ధర్మారెడ్డి

రాజేంద్రనగర్: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడిని బీఆర్ఎస్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పోరెడ్డి ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రంలో రౌడీ పాలన కొనసాగుతుందని, ఎమ్మెల్యేకే రాష్ట్ర రాజధానిలో రక్షణ లేకపోతే సామాన్య ప్రజల సంగతి ఏంటంటూ ప్రశ్నించారు. గత కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో ఎన్నడూ ఇలాంటి సంఘటనలు చూడలేదన్నారు. కౌశిక్ రెడ్డిపై జరిగిన దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. అరికపూడి గాంధీ అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. 9 నెలల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణను అన్ని రంగాల్లో నాశనం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నేడు ప్రశ్నించిన వారందరిపై దాడులు, కేసులతో భయపెట్టాలని చూస్తుందన్నారు. కౌశిక్ రెడ్డి గృహ నిర్బంధంలో ఉంచి అరికెపూడి గాంధీ గుండాలతో దాడి చేయిస్తారా అంటూ ప్రశ్నించారు. ఇది పూర్తిగా పోలీసులు వైఫల్యమేనని, రాష్ట్ర డీజీపీ వెంటనే దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అప్రజాస్వామిక పాలనపై కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ స్పందించాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో దాడులకు స్థానం లేదని స్పష్టం చేశారు. కౌశిక్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ మద్దతుగా ఉంటారని స్పష్టం చేశారు.

కబ్జాకు గురవుతున్న స్థలాన్ని కాపాడాలంటూ ఆర్డీఓకు వినతి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ హైదర్‌గూడలోని ఎర్రబోడలో పోచమ్మ ఆలయం వెనుకాల ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 7లో సుమారు 400 గజాల స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని గ్రామ ప్రజలు, యువకులు, యువజన సంఘం నాయకులు, కుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఆర్డీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ స్థలంలో గతంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వం భూమి అని సైన్ బోర్డును ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పుడు దాన్ని తొలగించి స్థలాన్ని కబ్జా చేస్తున్నారన్నారు. ఈ స్థలాన్ని దేవాలయం, ప్రజల అవసరాల కొరకు ఉపయోగపడే విధంగా చూడాలని కోరారు. ఓ పక్క ప్రభుత్వం హైడ్రా ద్వారా చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలను కాపాడుతుంటే, మరో పక్క ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు.



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ ప్రజలు తదితరులు

25న శాంతిసరోవర్‌లో సెమినార్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఈనెల 25వ తేదీన ప్రత్యేక సెమినార్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ సెమినార్‌ను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 'ఇంటిగ్రేషన్ ఆఫ్ సైన్స్ అండ్ స్పిరుచ్వాలిటీ, ది సోర్స్ ఆఫ్ ఇన్ఫినైట్ పాసిబిలిటీస్'అనే అంశంపై సెమినార్ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో గురువారం రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమంగా తీర్చి దిద్దేవారిని ప్రభుత్వం గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు ఇచ్చి గౌరవిస్తుందని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ముక్కర రాజు(శ్రీమేధాహైస్కూల్)సునిల్ కుమార్ (కాకతీయ గ్రూప్ ఆఫ్ స్కూల్)మంజు భార్గవి (అక్షర స్కూల్) నోడల్ ఆఫీసర్ ట్రస్మ జనరల్ సెక్రటరీ బాబురావులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎం. శ్రీనివాస్‌రెడ్డి, ఎం. నరసింహారెడ్డి, సోమ శ్రీనివాస్, కరుణాకర్ పాల్గొన్నారు.



సెయింట్‌ఆన్స్ మహిళా కళాశాలలో 'హిందీ దివస్'



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

గోల్కొండ: మెహిదీపట్నంలోని సెయింటాన్స్ మహిళా కళాశాలలో గురువారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిశ్రా ధాతూ నిగం చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.కె.ఝా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో హిందీ భాష ఉందని అంతర్జాతీయంగా కూడా గుర్తింపు ఉందన్నారు. హిందీ నేర్చుకున్న వారికి ఉద్యోగాలు తదితర విషయాల్లోనూ అదనపు ప్రయోజనం ఉంటుందన్నారు. విద్యనభ్యసించిన యువతకు ఉపాధి పొందడంలో తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కాగా విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్‌కు చెందిన ఎంకిర్యాల మల్లేష్‌కు 40 వేల రూపాయల సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి ద్వారా పేద ప్రజలను ఆదుకోవడం జరుగుతుందని, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకున్న వెంటనే నిధులు మంజూరయ్యేలా చూస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గోకరి సురేష్‌గౌడ్ తదితరులున్నారు.



లబ్ధిదారుడికి సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: ప్రపంచ కూచిపూడి దినోత్సవాన్ని పురస్కరించుకుని రవీంద్రభారతీలో శారద కళా క్షేత్రం, భావన కూచిపూడి నృత్య అకాడమీల ఆధ్వర్యంలో గురువారం నాట్యారాధన పేరిట నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రముఖ నృత్య గురువు భావన శిష్యురాలు ఆరాధ్య ప్రియదర్శినిరెడ్డి ఆరంగేటం కూచిపూడి నాట్య ప్రదర్శనలు అలరించాయి. అదేవిధంగా సంస్థకు చెందిన చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.